ప్రజాశక్తి

మంగళవారం 23 జులై 2024 5

శ్రీ సత్యసాయి

అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే...

సమస్యలకు పరిష్కారం

కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం కావాలంటే అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేయాల్సి ఉందని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలియజేశారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీరించారు. జాయింట్ కలెక్టర్అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్య, పీడీ నరసయ్య, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి 265 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, జిల్లాలో దృష్టి సారించాల్సిన అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు వారానికి ఒక్కరోజు శుక్రవారం నాడు హాస్టళ్లు, రైతు సేవా కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రులను తనిఖీ చేసి, సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. భూ తగాదాలకు సంబంధించిన కేసుల్లో ఆయా హెచ్ఒడిలు సమగ్ర కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ

జిల్లాలో వివిధ కళాశాలల్లో డిగ్రీ, పీజీ చదువుతున్న వికలాంగులకు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో మంజూరైన ల్యాప్‌లను కలెక్టర్ టిఎస్.చేతన్ కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. రూ.54 వేల రూపాయలు విలువజేసే 15 ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్య, సూపరింటెండెంట్ వెంకటరమణ పాల్గొన్నారు.

నిర్మలమ్మా.. కరుణించమ్మా..!



కేంద్రంలో 3వ సారి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి సారిగా బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నారు. 2024-25 బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం నాడు ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఏ మేరకు ప్రాధాన్యత లభిస్తోందోనని జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. గడచిన కేంద్ర బడ్జెట్‌ల్లో జిల్లాకు ఎలాంటి చెప్పుకోదగ్గ కేటాయింపులూ చేయలేదు. జిల్లా వాసులు ప్రతిసారీ బడ్జెట్‌పై ఆశలు పెట్టుకోవడం తరువాత ఉసూరుమనడం పరిపాటి అయ్యింది. ఈ సారైనా కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు న్యాయం చేసేలా కేటాయింపులు ఉండాలని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు.

◆ నేడు కేంద్ర బడ్జెట్
◆ కేటాయింపులపై ఉమ్మడి జిల్లావాసుల ఎదురుచూపు
◆ వెనుకబడిన ప్రాంతానికి ప్రాధాన్యత లభించేనా ..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఈ సారి ప్రవేశపెట్టేబోయే బడ్జెట్‌కు ఓ ప్రత్యేకత ఉంది. గతంలో రాష్ట్ర ఎంపీల అవసరం లేకుండానే బిజెపి ప్రభుత్వం కేంద్రంలో ఏర్పాటు అయ్యింది. ఈ సారి మాత్రం రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి, ఎన్డీఎ కూటమి ఎంపీల మద్దతుతో కేంద్రంలోని ప్రభుత్వం నడుస్తోంది. ఈ సందర్భంగానైనా వెనుకబడిన అనంతపురం జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని జిల్లావాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇది వరకు బడ్జెట్‌లలో తగినంత ప్రాధాన్యత లేదన్న విమర్శలున్న నేపథ్యంలో నేటి కేటాయింపులపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

కేంద్రీయ విశ్వవిద్యాలయానికి కేటాయింపులు జరిగేనా ?

కేంద్రీయ విశ్వవిద్యాలయం 2018లో ఏర్పాటైతే ఇప్పటికీ పూర్తి స్థాయి క్యాంపస్ పనులు పూర్తవలేదు. మొదటి దశ పనులను వచ్చే నెలకు పూర్తి చేయనున్నట్టు ప్రకటించారు. 2024 ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఈ విశ్వవిద్యాలయానికి ఒక్క రూపాయి నిధులు కూడా కేటాయించలేదు. ఇతర కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు మాత్రం నిధుల కేటాయింపులు జరిగాయి. ఈసారి బడ్జెట్‌లోనైనా కేంద్రీయ విశ్వవిద్యాలయంకు ప్రాధాన్యత కల్పిస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

విభజన హామీలు అమలు చేసేరా ..?

విభజన సమయంలో జిల్లాలో కేంద్రీయ సంస్థల ఏర్పాటుకు పునాదులు వేశారు. అందులో నాసన్ ఒకటి. నాసన్‌కు గతేడాది మొదటి దశ పనులు పూర్తి చేసి ప్రధానమంత్రి నరేంద్రమోది చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే ఇంకా వివిధ దశల పనులు పూర్తవ్వాల్సి ఉంది. ఇక పక్కనే బెల్ ఏర్పాటుకు 2014లో శంకుస్థాపన చేశారు. కాని ఇప్పటికీ దాని పనుల పురోగతి ఆశించినంత లేదు. దీనికి నిధుల కేటాయింపులు జరగలేదు. ఈ బడ్జెట్‌లోనైనా దీనికి పనుల పురోగతికి బాటలు పడుతాయా లేదా అన్నది చూడాల్సి ఉంది. ఇక గుంతకల్లు రైల్వే డిజవిన్‌కు నిధుల కేటాయింపులు అరకొరగానే సాగుతున్నాయి. దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

వెనుకబడిన ప్రాంతానికి నిధులిచ్చేరా

రాష్ట్ర విభజన సమయంలో వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయిస్తామని కేంద్రం హామీనిచ్చింది. 2014 నుంచి మూడు సంవత్సరాలు ఏడాదికి రూ.50 కోట్లు కేటాయించి తరువాత చేతులెత్తేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పాటైనందున నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తుందా లేదా అన్నది చర్చ నడుస్తుంది. బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ వెనుకబడిన ప్రాంతాలకివ్వాలన్న డిమాండ్‌ను విపక్షాలు వినిపిస్తున్నాయి.

రైతు వినూత్న ఆలోచన

సైకిల్ లాంటి పరికరంతో పంటలో కలుపు తొలగింపు

రొద్దం : మండలంలోని రొద్దకంపల్లిలో రైతు నారాయణప్ప తనకున్న ఎకరం పొలంలో వేరుశనగ పంట సాగు చేశాడు. ఈ క్రమంలో విత్తనం కొనుగోలు కోసం రూ. 7 వేలు, విత్తనం వేయడానికి రూ.2,500 ఖర్చు చేశారు. పంట పెరుగుతున్న సమయంలో కలుపు ఏపుగా పెరిగింది. కలుపు తొలగించాలంటే ఈ ఒక్క ఎకరానికి ఎవరూ ఎద్దులు పంపడం లేదు. దీనికి తోడు కలుపు తొలగించేందుకు ఒక రోజుకు రూ. 2,500 వరకూ ఖర్చు అవుతుంది. అంత ఖర్చు భరించలేని నారాయణప్ప రెండు పాత సైకిళ్లను కలుపు తీసేలా తయారు చేయించుకున్నాడు. వాటితో రైతు, కుమారుడు కలిసి వినూత్నరీతిలో మూడు రోజుల్లో కలుపు తొలగించాడు.

విష జ్వరంతో బాలిక మృతి

అమరాపురం : అమరాపురంలో నివాసం ఉంటున్న ఉదుగురు పాపయ్యగౌడ్ కుమార్తె మాన్య(14) విష జ్వరంతో బాధపడుతూ సోమవారం మృతి చెందిందిది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మాన్య నాలుగు రోజులుగా జ్వరంతో బాధ పడుతుండగా కర్నాటకలోని హిరియూరు, తుంకూరు ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ మాన్య సోమవారం మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, నాయకులు గురు సిద్ధప్ప, టిఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు రామచంద్రప్ప, తదితరులు మాన్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తుంగభద్ర నుంచి నీరు విడుదల

మూడు గేట్ల ద్వారా కిందకు పరుగులు తీస్తున్న నీరు

ప్రజాశక్తి-రాయదుర్గం

తుంగభద్ర రిజర్వాయర్ నుంచి సోమవారం నాడు నీటిని కిందికు విడుదల చేశారు. తుంగభద్ర నదిలోకి 40 వేల క్యూసెక్కులు, ఎగువ కాలువకు గంటకు 100 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఒఆర్‌కె.రెడ్డి సూపరింటెండింగ్ ఇంజినీర్ శ్రీకాంత్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవిచంద్రలు సోమవారం ఉదయం నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు రిజర్వాయర్ పూర్తిస్థాయి మట్టం 1633 అడుగులు కాగా సోమవారం సాయంత్రం 4గం॥కు 1628.09 అడుగుల నీటిమట్టం నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ గరిష్ట నీటి సామర్థ్యం105.788 శతకోటి ఘనపుడుగులు(టిఎంసి) కాగా ప్రస్తుతం రిజర్వాయర్లో 87.056 టిఎంసిల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్‌లోకి 1,01,993 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా సోమవారం సాయంత్రం 4గం॥లకు 7744 క్యూసెక్కుల నీటిని మూడు గేట్లు ఒక అడుగు మేరకు ఎత్తి నదిలోకి వదిలారు. రిజర్వాయర్‌లోకి నీటి రాకను బట్టి 40వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. 50 వేల క్యూసెక్కుల వరకు నీటిని నదిలోకి వదిలే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తుంగభద్ర ఎగువ కాలువకు గంటకు 100 క్యూసెక్కుల చొప్పున క్రమంగా 500 క్యూసెక్కులు మేర నీటిని విడుదల చేస్తామని బోర్డు అధికారులు తెలిపారు. ఈ నీరు అనంతపురం జిల్లా బొమ్మనహాల్ వద్ద ఈనెల 24న బుధవారం అనంతపురం జిల్లాలోకి ప్రవేశిస్తాయి. తుంగభద్ర నది దిగువన వరద నీరు విడుదల చేస్తున్నందున నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు.

స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న అధికారులు

ప్రస్తుతం తుంగభద్ర రిజర్వాయర్ నీటి వివరాలు..

రిజర్వాయర్ గరిష్ట నీటి సామర్థ్యం	105.788 టిఎంసిలు
సోమవారం నాటికి నీటి నిల్వ	87.056 టిఎంసిలు
రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం	1633 అడుగులు.
సోమవారం నాటికి నీటిమట్టం	1628.09 అడుగులు.
రిజర్వాయర్‌లోకి నీటి రాక	1,01,993 క్యూసెక్కులు.
తుంగభద్ర దిగువనకు నీటి విడుదల	40,000 క్యూసెక్కులు.
ఎగువ కాలువకు నీటి విడుదల	500 క్యూసెక్కులు.

బడ్జెట్‌లో ఎపికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి

మడకశిర : రాష్ట్ర విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి(డిహెచ్‌పిఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్. హను మంతు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, పోర్టులు, రైల్వే పనులు, జాతీయ, గ్రామీణ రహదారులు,లిడ్ క్యాప్, సెజ్ పేరుతో ఇదివరకే సేకరించిన భూముల్లో పరిశ్రమల స్థాపన, వ్యవసాయ ఉత్పత్తులు, నీటి పారుదల, పర్యాటక రంగం అభివృద్ధి, మెడికల్ కళాశాలలు, ప్రతి నియోజకవర్గ కేంద్రంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం తదితర వాటికి అవసరమైన నిధులు కేటాయించి రాష్ట్ర అభివృద్ధికి చేయూత ఇవ్వాలని కోరారు. ప్రధానంగా ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్రయివేటీకరణ ఆలోచనను ఉపసంహరించుకుని ప్రభుత్వమే బాధ్యతాయుతంగా నడపాలని కోరారు. రాష్ట్రంలో రోజు రోజుకూ దళితులు, గిరిజనుల మీద పెరిగిపోతున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ప్రతేక కోర్టులు ఏర్పాటు చేసి సత్వరమే వారికి పారితోషికం అందించాలన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దుర్వినియోగం చేయకుండా వారి సంక్షేమానికే వినియోగించేలా చొరవ తీసుకొవాలని కోరారు.

ప్రజల సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అమరాపురం

మండల వ్యాప్తంగా ప్రజల సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని మండలంలోని అన్ని శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో భాస్కర్ సోమవారం తెలిపారు. ప్రధానంగా సీజనల్ వ్యాధుల నిర్మూలన, పారిశుధ్యం, మురికి కాలు వల శుభ్రత, ఇంటి పన్ను వసూలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కూలీల సంఖ్య పెంపు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఎంపిడిఒ మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈఓఆర్‌డి నాగమణి, ఎపిఒ జగదీష్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీర్లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని నక్కలగుట్ట నివాస పరిధిలో భూ సేకరణ ద్వారా ప్రభుత్వం సేకరించిన భూమిలో మిగులు భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడి ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిపిఎం మండల కార్యదర్శి రంగప్ప అధ్యక్షతన సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు తహశీల్దార్ అంజనాదేవికి వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ సోమందేపల్లి రెవెన్యూ గ్రామా పరిధిలో 2009లో అప్పటి ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ, పేదల అవసరాలకు ముందస్తు ప్రణాళికతో అవసరమైన భూములను గుర్తించి రైతులకు పరిహారం చెల్లించి 60 ఎకరాలు భూ సేకరణ చేసిందన్నారు. అప్పటి నుంచి ప్రభు త్వం సుమారు 35 ఎకరాలను పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు, పాఠశాల, అంగనవాడీ భవనం, కమ్యూనిటీ హాల్, గ్రామ సచివాలయం కోసం వినియోగించారు. ఇంకా 20 నుంచి 25 ఎకరాల మిగులు భూమి ఉందని, అయితే ఆ భూమి కొందరి ఆక్రమణలో ఉందని సర్వే నెంబర్లతో సహా అధికారులకు తెలిపారు. వారి నుంచి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని నాయకులు అధికారులను కోరారు. కార్యక్ర మంలో ఐద్వా జిల్లా కార్యదర్శి గౌతమి, సిపిఎం మండల కమిటీ సభ్యులు ఈడిగ లక్ష్మీనారాయణ, వెంకటేశులు, కల్లు గీత కార్మిక సంఘం మండల నాయకులు రామకృష్ణ, సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, నాగభూషణ, రవి, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణస్వామి, కుమ్మర కిష్టప్ప, నజీర్, రామాంజనేయులు, కెవిపిఎస్ మండల నాయకులు గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ అంజనాదేవికి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

డిజిటల్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

గోరంట్ల : మండలంలోని మందలపల్లి గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని సోమవారం ఆ సచివాలయ పరిధిలోని ప్రజలు ఎంపిడిఒ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ డిజిటల్ అసిస్టెంట్ ఉదయం 11 గంటలైనా కార్యాలయానికి రావడం లేదని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. డిజిటల్ అసిస్టెంట్ అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్, మాజీ జడ్పిటిసి గోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

సోమందేపల్లి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎంపిడిఒ ఎంజి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో సోమశేఖర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, సంబంధిత అధికారులు, ఉపాధి హామీ వేతనందారులు, మండల ప్రజలు పాల్గొనాలని ఏపీవో కోరారు.

నేడు భక్తరహళ్లి ఆలయ హుండీ లెక్కింపు

మడకశిర రూరల్ : మండలంలోని భక్తరహళ్లి జిల్లేడుగుంట ఉమ్మడి దేవస్థానాలకు సంబంధించిన హుండీలను మంగళవారం లెక్కిస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికారి నరసింహరాజు తెలిపారు. ఉదయం 9:30 గంటలకు జిల్లేడుగుంట ఆంజనేయస్వామి ఆలయ హుండీల లెక్కింపును ప్రారంభి స్తారు. ఆ తర్వాత భక్తరహళ్లి దేవస్థానం హుండీని లెక్కిస్తారని ఆయన తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, భక్తులు హాజరుకావాలని ఆయన సూచించారు.

తహశీల్దార్ బాల నరసింహులుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ధర్నా

లేపాక్షి : విద్యార్థుల సమస్యలపై సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ బాల నరసింహులుకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థుల పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

లేపాక్షి : మండలంలోని కంచిసముద్రం గ్రామంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను సోమవారం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్, డాక్టర్ రామసుబ్బయ్య పరిశీలించారు. రైతులకు మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ చర్యలను వివరించారు. డాక్టర్ జాన్సన్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకూ 4,566 హెక్టార్లలో రైతులు మొక్కజొన్న విత్తనం వేశారన్నారు. కత్తెర పురుగు ఆశించినట్లుగా గమనించామన్నారు. ఆ పురుగు లక్షణాలు, నివారణ చర్యలను రైతులకు వివరించారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి డి.శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారి పుష్పలత, రైతు సేవా కేంద్రం సిబ్బంది పార్థసారధి, రఘు, హరి, రైతు శ్రీరామరెడ్డి ఉన్నారు.

మండలానికో అంబేద్కర్ భవన్ నిర్మించాలి

కదిరి టౌన్ : జిల్లా వ్యాప్తంగా మండలానికో అంబేద్కర్ భవన్ నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కదిరప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ చేతన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలు వివాహ శుభకార్యాలు చేసుకునేందుకు అంబేద్కర్ ఫంక్షన్ హాల్ నిర్మిస్తే సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో భాస్కర్, శ్రీనివాసులు, ఎన్ఎస్‌యుఐ జిల్లానాయకులు ఉపేంద్ర పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలను అరికట్టాలి : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా గట్టి భద్రత ఏర్పాట్లను చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సెబ్ అధికారులను కోరారు. సోమవారం శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి.రత్నను సెబ్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆమె సెబ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు,పనితీరు, వారి యొక్క విధులు గురించి ఆరా తీశారు. గాంజాయి, నాటు సారా, తదితర ఆసాంఘిక కార్యకలాపాల పై దృష్టి పెట్టి వాటిని పూర్తిగా నిర్మూలించే విధంగా గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు.

అంతర్జాతీయ పోటీల్లో 'పురం' విద్యార్థినికి బంగారు పతకం

హిందూపురం : పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని అర్పిత అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ లో పాల్గొని బంగారు పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి తెలిపారు. బంగారు పథకం సాధించిన విద్యార్థిని అర్పితను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతు ఆదివారం హైదరాబాదు లోని కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీలలో తమ కళాశాల విద్యార్థిని అర్పిత ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించడం సంతోషంగా ఉందన్నారు. అర్పితకు ఆర్థిక సహకారం అందజేసిన ఇన్నర్ వీల్స్ క్లబ్ అధ్యక్షురాలు విద్య, సభ్యులు తుల్జాబాయి, భువన, అశ్వథలక్ష్మి, పద్మ తదితరులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేసులు, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ యశోద, అధ్యాపకులు డాక్టర్ రవి నాయక్, డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్పితను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి, తదితరులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ గేటు ముందు మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారు జామునుంచి సిఐటియు నాయకులు, పారిశుధ్యకార్మికులు మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా రెండు గేట్లను మూసి వేసి, గేటు ముందు సుమారు 5గంటల పాటు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, రాము, మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గత 4 సంవత్సరాలుగా కోరుతున్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆందోళనలు తీవ్రతరం చేస్తే ఆ సమయంలో మాత్రం పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఆ తరువాత పట్టించుకోవటం లేదని విమర్శించారు. 60 సంవత్సరాలు పైబడిన 10 మంది కార్మికులను తొలగించారని, తొలగించిన వారందరికి పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వలేదని అన్నారు. వారి కుటుంబంలో ఒకరికి వెంటనే ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డైలీవేజ్ కింద తీసుకున్న కార్మికులకు ఎస్ ఎస్ ఆర్ రేటు కింద వేతనాలు ఇవ్వాలని సమ్మె చేస్తే ఆ సమయంలో అంగీకరించారని అయితే ఇప్పటి వరకు అమలు చేయలేదని అన్నారు.కార్మికులకు అవసరమైన పని ముట్లు, చెప్పులు, సబ్బు, నూనె, యూనిఫామ్ ఇవ్వకుండా కాంట్రాక్టర్ మీద నెపం చెపుకుంటూ కాలం గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో నిరవధిక సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. స్పందించిన కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఆందోళన విరమించాలని కార్మికులను కోరారు. అయితే లిఖితపూర్వకంగా తమకు హామీ ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. దీంతో తమ పరిధిలో ఉన్న 4 సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. మిగిలిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి 10 రోజుల్లో సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తామనిలిఖిత పూర్వకంగా కమిషనర్ హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, యూనియన్ నాయకులు రామచంద్ర, పరమేష్, గురునాథ్, మహిళ నాయకురాలు సుబ్బమ్మ, మహేశ్వరమ్మ, కవితతో పాటు పెద్ద ఎత్తున పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

తలుపుల విద్యార్థినికి బంగారుపతకం

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని గంజి వారి పల్లికి చెందిన గుణరంజన్ రెడ్డి కుమార్తె సోహన్విక బంగారు పతకంలో మెరిశారు. బెంగళూరులో ఆదివారం నిర్వహించిన సౌత్ జోన్ తెక్వాండ్ విభాగంలో ఆమె బంగారు పథకాన్ని సాధించింది. విద్యార్థికి బంగారు పతకం సాధించడంతో విద్యార్థి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఎన్నికల బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా నుండి ఇక్కడికి వచ్చిన తిరిగి సొంతప్రాంతానికి వెళుతున్న తహశీల్దార్ కళావతిని రెవిన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిటి స్వాతి, వీఆర్వోలు చెన్నయ్య, కాటమయ్య, వేణు, నారాయణప్ప, సచివాలయ సిబ్బంది, విఆర్ఎలు పాల్గొన్నారు.

గ్రామసభ

నల్లమాడ : మండలంలోని దోన్నికోట గ్రామంలో జల జీవన మిషన్ స్వచ్ఛభారత్ మిషన్‌పై సోమవారం గ్రామసభను నిర్వహించారు. సర్పంచి సరస్వతి అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో గ్రామ కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రథయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రాష్ట్రవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై హిందూపురం నుండి ఇచ్చాపురం వరకు చేపడుతున్న రథయాత్రను జయప్రదం చేయాలని ఏపీ. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటుమద్ది ఓబులేసు కోరారు. సోమవారం పుట్టపర్తి లోనీ సాయి ఆరామంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నలుమూల నుండి వచ్చిన దళిత సంఘ నాయకులు శ్రీ సత్య సాయి జిల్లా నూతన కన్వీనర్ గా ఈదులపల్లి రామ్మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కుంటిమద్ది ఓబులేసు మాట్లాడుతూ ఎస్సీల సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించే విధంగా ఉద్యమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మద్దిలేటి గంగిశెట్టి ,జిల్లా అధ్యక్షులు రామాంజినప్ప, పెనుగొండ నరసింహులు,హెచ్ ఎస్ ముత్యాలు, కేశప్ప, నాగేష్ బాబు, సుధాకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనం గడపాలి

పుట్టపర్తి రూరల్ : ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని జిల్లా మలేరియా యూనిట్ అధికారి డాక్టర్ కెసి. కుల్లాయప్ప నాయక్ పేర్కొన్నారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా ఆయన సోమవారం పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజు పల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. డ్రైడే ఫ్రైడే పాటించి జ్వరాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సహాయ మలేరియా యూనిట్ అధికారి లక్ష్మీ నాయక్, ఎస్‌యుఒ రమణయ్య, వెంకటేష్ , సూపర్ వైజర్ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పి అపర్ణ, రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి మూర్తి, ఆరోగ్య కార్యకర్త ప్రమీల, ఆశా కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎకోక్లబ్‌లు ఏర్పాటు చేయాలి

కలెక్టర్ టిఎస్. చేతన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బోధనా పరికరాలు చూపుతున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కొత్త ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి మండల పరిధిలోని ఎనుములపల్లి జడ్పీ హైస్కూల్ లో శిక్షా సప్తా పథకం 4వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డిఇఒ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్తమ అభ్యాసాలను పంచుకోవడానికి, సవాళ్లను చర్చించడానికి ఈ వేదిక ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు, ఎంఇఒలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బీఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తహ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వనరులతో బోధనా సామాగ్రి ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఇఒలు రాజేశ్వరిదేవి, గోపాల్ నాయక్ హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారుచేసిన బోధన సామాగ్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బత్తలపల్లి :స్థానికంగా ఉన్న వనరులతో బోధనా సామాగ్రిని తయారు చేసుకుని విద్యార్థులకు బోధన చేయాలని ఎంఇఒలు చాముండేశ్వరి, సుధాకర్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం బత్తలపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలతో పాటు మండలంలోని సంజీవపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, నల్లబోయనపల్లి, మాల్యవంతం, రామాపురంలోని ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్' వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ విద్యా విధానం–2020 ప్రారంభమై నాలుగు సంవత్సరాలు పూర్తి కావటాన్ని పురస్కరించుకుని అమలు జరుగుతున్న ఈ వారోత్సవాలు మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా ప్రారంభమైనట్లు వివరించారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు రోజుకి ఒక కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా మొదటి రోజు ఉపాధ్యాయులు స్థానికంగా ఉన్న వనరులతో బోదనా సామాగ్రిని తయారు చేసుకుని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాల ధర తగ్గింపు అన్యాయం

పాడిరైతుల ఆందోళన

నిరసన వ్యక్తం చేస్తున్న పాడిరైతులు, నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మూడు నెలలుగా వరుసగా పాల ధరలు తగ్గించడం వల్ల పాడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని తక్షణమే ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత రైతు వ్యవసాయ కూలీల సంఘం ఆధ్వర్యంలో పాడి రైతులు సోమవారంపుట్టపర్తి కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ లీటరు నీళ్ల ధర కూడా లీటరు పాలకు లేకపోవడం దుర్మార్గమన్నారు. ప్రైవేటు డెయిరీలు సిండికేట్ గా మారి పాల ధరలను తగ్గించేయడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగం తరువాత పాడి రంగాన్నే నమ్ముకుని ఎంతోమంది జీవనం సాగిస్తున్నారని, ఈ క్రమంలో పాల ధరలు పూర్తిగా తగ్గించడం అన్యాయమని అన్నారు. పశుగ్రాసం, దాణా ఖర్చులు పెరిగిపోవడంతో పాడి రంగం సంక్షోభంలో కూరుకు పోతోందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ప్రతి మండలంలోనూ ప్రభుత్వ రంగ డైరీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాల ధరలు పెంపునకు చర్యలు తీసుకునేలా ప్రైవేటు డెయిరీ పై ఒత్తిడి తీసుకురావాలన్నారు.

దేవాలయాల అభివృద్ధికి సహకారం ఇవ్వండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి నియోజకవర్గంలో గల దేవాలయాల అభివృద్ధికి తగిన సహకారం ఇవ్వాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు , దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వాలని మంత్రిని కోరారు. 2014 నుంచి 2019 వరకు మంత్రిగా అయ్యన్న పాత్రుడు పుట్టపర్తి నియోజకవర్గానికి ప్రత్యేకంగా నిధులు ఇచ్చినట్లు గుర్తు చేశారు.అలాగే సహకారం ఇవ్వాలని ఆమె కోరారు.

తారక్ చేయుత ట్రస్ట్ సహకారం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని తారక్ చేయూత ట్రస్ట్ నిరుపేద కుటుంబానికి తనవంతు చేయూతను అందించింది. పట్టణంలోని రామ్ నగర్ లో నివాసముంటున్న చేనేత కార్మికుడు నీలూరు రమేష్‌కు ఇద్దరు కూతుర్లు అయిన నీలూరి నికిత, నీలూరి దక్షిత ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. విషజ్వరం సోకి కోమాలోకి వెళ్లారు. బెంగుళూరులోని ఆసుపత్రిలో వారిని చేర్పించగా మూడు లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. దీంతో నీలూరు రమేష్ తన కూతుళ్లను కాపాలని స్థానిక తారక్ చేయుట ట్రస్ట్ వారిని ఆశ్రయించాడు. దీంతో ట్రస్టు అధ్యక్షులు రామాంజనేయులు తమ ట్రస్టు వంతు సాయంగా రూ. 20వేలను అందజేశారు. సంఘం రాఘవ మరో రూ.20వేలను అందజేశారు. ఈసందర్భంగా ట్రస్టు అధ్యక్షులు రామాంజినేయులు మాట్లాడుతూ పిల్లల యొక్క తండ్రి నీలూరు రమేష్ సిల్క్ హౌస్‌లో గుమాస్తాగా పని చేస్తున్నాడని రెక్కాడితే డొక్కాడని పరిస్థితి వారిది అని అన్నారు. దాతలు ఎవరైనా సాయం అందించాలని కోరారు. పిల్లల తల్లిదండ్రుల ఫోన్ పే నెంబర్ 8985799002కు దాతలు ఆర్థికసాయం చేయాలని కోరారు.

శస్త్ర చికిత్స చేసి తొలగించిన గడ్డను చూపిస్తున్న వైద్య బృందం

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో వైద్యులు సోమవారం అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఓ మహిళ కడుపులో ఉన్న 3కిలోల గడ్డను వైద్యులు తొలగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్, ప్రముఖ గైనకాలిస్టు బాబా బుడేన్ వెల్లడించారు. పట్టణ పరిధిలోని మోత్కుపల్లికి చెందిన కల్పన పొట్టవాపు ఇబ్బందితో అసుపత్రికి వచ్చిందన్నారు. అన్ని పరీక్షలను నిర్వహించిన వైద్యులు శస్త్ర చికిత్స చేయాలని కల్పన బంధువులను సూచించారని అందుకు వారు అంగీకరించడంతో ప్రభుత్వ అసుపత్రిలో డాక్టర్ బాబా బుడేన్, లక్ష్మి రామ్ నాయక్‌ల ఆధ్వర్యంలో శస్త్ర చికిత్స చేసి మహిళా కడుపులో ఉన్న కణతిని తొలగించినట్లు చెప్పారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ఇలాంటి ఎన్నో రకాల శస్త్రచికిత్సలకు ఇక్కడి ప్రజలు బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్తుంటారని అలాంటి వారికి జిల్లా అసుపత్రిలోనే ఇలాంటి ఆపరేషన్లు చేసి మెరుగైన సేవలు అందించాలని లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలో వైద్యులతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది సునీత రాణి, సుమలత, నాగరాజు తదితరులు పాల్గొన్నారని వివరించారు.

విలేకర్లు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన మండల కేంద్రాల్లో విలేకర్లు కావలెను.
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
శ్రీ సత్యసాయి జిల్లా
-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-
తాడిమర్రి, ధర్మవరం రూరల్, కనగానపల్లి, రామగిరి, రొళ్ల, గుడిబండ
ఇంటర్వ్యూ : తేది: 26-07-2024 శుక్రవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 9490099311,9490099312,313
ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం,
D.No: 42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Ananthapuramu

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని బత్తలపల్లి మండలంలో ఇల్లు లేని పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో పేదలు సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ సర్వేనెంబర్ 401లోని నిడిమామిడి వీరభద్రాలయ మఠం భూమిని పశువుల మేత కోసం కేటాయించారన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో కొంతమంది నాయకులు ఆ భూమిని కాజేయాలని దొంగ పత్రాలు సృష్టించారన్నారు. ఆ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించాలని ప్రయత్నించారని రిజిస్ట్రేషన్ చేయకుండా కబ్జాదారులకు ఎన్ఒసి ఇవ్వకుండా సబ్ రిజిస్టర్ దృష్టికి తెచ్చామన్నారు. మఠం భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఇదే భూమిలో ఇళ్లులేని పేదలు గుడిసెలు వేసుకున్నారని వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం కార్యదర్శి జింకా చలపతి, పార్టీ నాయకులు వెంకటేష్, కుళ్లాయప్ప, నాగభూషణ, పేదలు పాల్గొన్నారు.

వీడియోగ్రాఫర్ల బిల్లులు చెల్లించాలని వినతి

పుట్టపర్తి రూరల్ : 2024 సార్వత్రిక ఎన్నికల్లో శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల్లోనూ ఫోటో, వీడియో గ్రాఫర్లుగా విధులు నిర్వహించిన వారికి వెంటనే బిల్లులు చెల్లించాలని పెనుకొండ ఫోటో, వీడియో గ్రాఫర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పుట్టపర్తి కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలోకలెక్టర్ టిఎస్.చేతన్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గంలో ఫోటో, వీడియో గ్రాఫర్లతో 57 రోజులు ఎన్నికల విధులలో పని చేయించుకున్నారని తెలిపారు. వారికి ఒక్క రూపాయి కూడా అడ్వాన్స్ ఇవ్వకుండా ఎన్నికలు పూర్తి అయిన తరువాత బిల్లులు పూర్తిగా చెల్లిస్తామని చెప్పారని ఇప్పటికి చెల్లించలేదని వాపోయారు. ఇప్పటికైనా తమకు రావల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ నియోజకవర్గం ఫోటో,వీడియో గ్రాఫర్లు గోరంట్ల జనార్ధన, లక్ష్మీనారాయణ , భాస్కర, కేశవ, తిరుపాల్, జిలాన్‌బాషా, పెనుకొండ అనిల్ కుమార్ పురుషోత్తం,రాజు, భాషా తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వాహనం ఢీ కొని యువకుడు మృతి

ప్రజాశక్తి - మడకశిర రూరల్

రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని బుల్లసముద్రం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బుల్లసముద్రం గ్రామానికి చెందిన ప్రసాద్(30) రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో అతడి భార్య, తల్లి సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం : టిడిపి కార్యకర్త ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చరవాణి ద్వారా అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టిడిపి అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి ద్వారా రూ. 20వేలు అందజేశారు.

యువకుడు అదృశ్యం..

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని జూలుకుంట గ్రామానికి చెందిన రుద్ర(21) 45 రోజులుగా కనిపించకుండా పోయాడని అతడి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. రుద్ర జూన్ 1వ తేదీ నుంచి కనపడడం లేదని అతడి మామ హనుమప్ప, అత్త చెన్నమ్మ 3వ తేదీ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. కనబడకుండా పోయి 45 రోజులు అవుతున్నా ఆచూకీ లభ్యం కాకపోవడంతో అత్తమామలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం వారు మాట్లాడుతూ రుద్ర తల్లిదండ్రులు మృతి చెందడంతో తామే కొడుకుగా పెంచుకుంటున్నామని తెలిపారు. జూన్ 1వ తేదీ గ్రామంలోని తోటి స్నేహితులు పిలుస్తున్నారంటూ సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లాడని, అప్పటి నుంచి ఆచూకీ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. రుద్రకు ఫిట్స్ వస్తుంటాయని ఆసుపత్రిలో చికిత్స కూడా చేయిస్తున్నామన్నారు. రుద్ర ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామనికి చెందిన కొందరు యువకులు రుద్రను ఇప్పటికే పలుమార్లు బెదిరించారని, ఆ విషయం రుద్ర తమకు చెప్పినా తాము పెద్దగా పట్టించుకోలేదని వాపోయారు. వారే ఏమైనా చేశారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ఇకనైనా పోలీసులు తమ అల్లుడిని వెతికి పెట్టాలని వేడుకుంటున్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 95051 44640, 94413 77331 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం చౌళూరు గ్రామానికి చెందిన దీపిక (25) అనారోగ్యంతో ఆదివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న దీపిక ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది.. వెంటనే తల్లిదండ్రులు కర్నాటక రాష్ట్రం గౌరిబిదనూరులోని ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతు దీపిక మృతి చెందింది. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ అప్ గ్రేడ్ స్టేషన్ పోలీసులు తెలిపారు.

33 ఏళ్ల నాటి కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - నల్లమాడ

1987 సంవత్సరంలో జరిగిన ఘటనపై నిందితుడి పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని వేల్లమద్ది పంచాయతీ పుట్టకప్ప కొట్టాల గ్రామంలో 1987లో జరిగిన ఘర్షణకు సంబందించి అప్పట్లో కేసు నమోదయింది. ఈ కేసుకు సంబందించి నిందితుడు అంజినప్పను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.

దుకాణంలో చోరీ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రంలో సమీపంలోనిరాయచోటి కదిరి ప్రధాన రోడ్డు పక్కన ఉన్న దుకాణంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఈ మేరకు బాధితురాలు నాగకుమారి తనకు జరిగిన నష్టంపై ఎస్ఐ కృష్ణవేణికి ఫిర్యాదు చేశారు. నాగకుమారి రేకుల షెడ్డు దుకాణంలో శీతల పానీయాలు, టీ, వడలు విక్రయిస్తూ జీవనం చేసేది. సోమవారం తెల్లవారుజామున ఉదయం ఐదు గంటల సమయంలో దుకాణం వద్దకు వెళ్లగా దాదాపు 15 సంవత్సరాలు యువకుడు తాళాలు పగలగొట్టి శీతల పానీయాలు తిండిబండారాలు గోను సంచిలో మూట కట్టుకుని పరిగెత్తాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం మున్సిపాలిటీలో కాంట్రాక్టు పద్ధతిన వాటర్ సప్లై పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న బొగ్గు వెంకటరాముడు (56) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తోటి మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు, సిబ్బంది వెంకటరాముడు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మున్సిపల్ ఉద్యోగులు తమవంతుసాయంగా మృతుని కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వాటర్ సప్లయ్ కాంట్రాక్టు ఉద్యోగుల యూనియన్ నాయకులు మహేశ్, దాసరిసురేశ్, రెగ్యులర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూ సమస్యలను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా పరిధిలోని భూ, స్థల సమస్యలను చట్టపరంగా కోర్టులో పరిష్కరించుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎన్ రత్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల నుండి సమస్యలను తెలుసుకుని వారితో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రధానంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలు మహిళా సమస్యలు ఎస్సీ ,ఎస్టీ, వికలాంగులు, వృద్ధుల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత నిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చట్టపరంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉన్నతాధికారులకు ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎన్ విష్ణు, లీగల్ అడ్వైజర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయ భవనం మార్చాలని వినతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్త చెరువులోనే గాంధీనగర్ పాఠశాల ఆవరణంలో గల ఉన్న డీఈవో కార్యాలయ భవనాన్ని మరోచోటకు మార్చాలని మానవ హక్కుల సంఘం నాయకులు భాస్కర్ నాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థులు చదువుకున్న టైములో వాహనాలు రాకపోకలు జిల్లాలోనే ఉపాధ్యాయులు, ఇతరులు వస్తున్నందున విద్యార్థులకు చదువులకు ఆటంకం ఏర్పడుతుందని అన్నారు. పాఠశాలలో ఇలా అంతరాయం ఏర్పడుతున్నందున ఇక్కడ చేరే విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతోందన్నారు. తుందన్నారు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ కార్యాలయాన్ని మరొక చోటకు తరలించాలని ఆయన కోరారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ కాలేజ్, బాలుర బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలను మంగళవారం పంపిణీ చేయనున్నట్లు ఎంఇఒ గోపాల్‌నాయక్ తెలిపారు. పట్టణంలోని కోట మున్సిపల్ స్కూల్లో వీటిని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ధర్మవరం రూరల్, టౌన్ లో ఉండే 101 ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఇప్పటికే పాఠ్యపుస్తకాలను ఇవ్వడం జరిగిందన్నారు.

ఎస్పీని కలిసిన 'చిలకం'

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సత్యసాయి జిల్లా నూతన ఎస్పీ వి.రత్నను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో చిలకం మధుసూదన్‌రెడ్డి నూతన ఎస్పీకి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న 'చిలకం'